

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 ; కనిష్ఠం 18.2



12 నుంచి 16 వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు బంద్

ఇంద్రవెల్లి, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 12 నుంచి 16 వరకు మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు బంద్ ఉంటాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి యు.రాజేశ్వర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సీసీఐ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలని కోరారు. తిరిగి ఈనెల 17న యధావిధిగా సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి పంటను కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు.





- జిల్లాలోని 162 పంచాయతీల్లో ఏకగ్రీవ ఎన్నిక
- ఐదేళ్లు గడిచిపోతున్నా నిధుల విడుదలపై ఊసెత్తని సర్కారు
- ఈనెల 31తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- ప్రోత్సాహక నిధుల కోసం తప్పని ఎదురుచూపులు

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులేవీ?

ఆదిలాబాద్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహ నిధుల జాడే కనిపించడం లేదు. ఇదిగో అదిగో అంటూ కాలం గడుపుతూ వస్తున్న ప్రభుత్వం నిధుల విడుదలపై నిండు నిర్లక్ష్యం వహిస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈసారి కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో అసలు ప్రోత్సాహ నిధుల జోలికి వెళ్లినట్లే కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు రూ.10లక్షల నిధులను అందిస్తామని ప్రకటించారు. ఎలాగైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహ నిధులను అందిస్తుందని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఐదేళ్లు గడిచిపోతున్న ప్రభుత్వం ప్రోత్సాహక నిధుల ఊసెత్తక పోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైన ఏం లాభమంటూ సర్పంచ్‌లు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. జిల్లాలో 468 గ్రామపంచాయతీలు ఉండగా 162పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. భారీ నజరానా అందుతుందని గ్రామపెద్దలు ఏకమై పంచాయతీ పాలక వర్గాన్ని ఏకగ్రీవం చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. కొందరు అభ్యర్థులు పోటీలో నిలిచిన ప్రభుత్వం అందించే నజరానాతో తమ గ్రామాభివృద్ధి జరుగుతుందని భావించి పోటీ నుంచి తప్పుకున్నారు. జిల్లాలో 162 ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షల చొప్పున మొత్తం రూ.16కోట్ల 20లక్షల నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. గతంలో చివరి సమయంలో ప్రోత్సాహక నిధులను విడుదల చేయడంతో సక్రమంగా వినియోగించ లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవయ్యాయి. ఈ నెల 31తో గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసిపోనుంది. మిగిలిన 19 రోజుల్లో నిధులు మంజూరు కావడం కష్టసాధ్యమేనన్న అభిప్రాయాలు విన్పిస్తున్నాయి. అలాగే ఖాళీ ఏర్పడిన గ్రామ పంచాయతీలు, వార్డులకు ఉపఎన్నికలు నిర్వహించకుండానే అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. నిధుల కొరతతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చే పరిస్థితి లేదంటూ ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్న నిధులు వాయిదాలకే..

గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించి పల్లె ప్రగతికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. గ్రామాలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసింది. అయితే పల్లె ప్రగతికి ప్రణాళికలు రూపొందించిన సరిప డా నిధులు లేకపోవడంతో గ్రామాభివృద్ధికి ఆటంకంగా మారుతోంది. గ్రామాల్లో పల్లె ప్రగతి కింద నర్సరీలు, శ్మశాన వాటికలు, డంపింగ్‌యార్డులు, పల్లె ప్రకృతి వనాలు తదితర అభివృద్ధి పనులను చేపట్టింది. వీటితోపాటు ప్రతీ గ్రామ పంచాయతీకి వాయిదాల పద్ధతిలో ట్రాక్టర్, వాటర్ ట్యాంక్‌ను అందించింది. ఉన్న నిధులతో వాయిదాలను చెల్లించడంలో ఇతర పనులను చేపట్టేందుకు సర్పంచ్‌లకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అప్పు సప్పు చేసి అభివృద్ధి పనులు చేపట్టిన నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. సాధారణంగా పంచాయతీలకు కేటాయించే అరకొర నిధులతో శాశ్వత సమస్యల పరిష్కారానికి ఆస్కారం ఉండదు. కేవలం పారిశుధ్యం, వీధిదీపాల ఏర్పాటు, ట్రాక్టర్ నిర్వహణ, పంచాయతీ సిబ్బంది వేతనాలు, మంచి నీటి సరఫరా లాంటి పనులకే సరిపోతున్నాయని చెబుతున్నారు. అయితే ప్రోత్సాహక నిధులను అందిస్తే దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

మిగిలింది 19 రోజులే..

గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగి ఈనెల 31తో ఐదేళ్లు గడిచిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహక నిధుల ఊసెత్తడం లేదు. మిగిలిన 19రోజుల్లో ప్రోత్సాహక నిధులు విడుదలైన చేసేదేమీ ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సకాలంలో నిధులను విడుదల చేసి ఉంటే కొంత మేరకైనా గ్రామాలఅభివృద్ధి జరిగిఉండేదని చెబుతున్నారు. గతంలో పల్లె ప్రణాళికలో భాగంగా నిధులు మంజూరవుతాయని ప్రత్యేక అధికారులు ప్రకటించిన ప్రభుత్వం స్పందించనే లేదు. ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఎంతో ఉత్సాహంగా ఉన్న సర్పంచ్‌లు అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకొని నిధుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. తమపై ఎంతో నమ్మ కం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు సమాధానం చెప్పుకోలేక పోతున్నామని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. మళ్లీ ఏకగ్రీవమంటేనే ప్ర జలు తిరుగబడే పరిస్థితి కనిపిస్తుందంటున్నారు. ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామప్రగతి ప్రణాళికలు అమలుకు నోచుకోవడం లేదంటున్నారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి పోయినా ప్రోత్సాహక నిధులను విడుదల చేసి ప్రత్యేక అధికారులతో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు వస్తాయని ఎంతో ఆశపడ్డాం..



- మడావి లింబాజి (భీంపూర్ సర్పంచ్)

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు వస్తాయని ఎంతో ఆశపడ్డాం. కానీ పదవీకాలం ముగిసి పోయేందుకు సమయం దగ్గరపడింది. ఇప్పట్లో నిధులు విడుదలైనా చేసేది ఏమీ ఉండదు. ప్రభుత్వం ప్రకటించి నిధులను విడుదల చేయకపోవడం బాధాకరం. గ్రామ అభివృద్ధికి నిధులు అక్కరకు వస్తాయని భావించిన ఫలితం లేకుండానే పోయింది.

ఇప్పట్లో నిధుల విడుదల కష్టమే..



- శ్రీనివాస్ (జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్)

జిల్లాలో 162 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఈనెల 31తో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగుస్తోంది. ప్రోత్సాహక నిధుల విషయమై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలేమీ లేవు. సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు తరుచూ అడుగుతున్నా ఏమీ చెప్పలేకపోతున్నాం. జీపీలకు ప్రోత్సాహక నిధుల విడుదల కష్టంగానే కనిపిస్తోంది.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు

- జిల్లా పంచాయతీ శాఖ అధికారి శ్రీనివాస్



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

ఇంద్రవెల్లి, జనవరి 11: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి పారిశుధ్యం లోపించకుండా జాగ్రతలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి ఇంటి పన్ను వసూళ్లు, పారిశుధ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని అందునాయక్ తండా, భీంనగర్ గ్రామాలను సందర్శించి పారిశుధ్యం పనులను పరిశీలించారు. డంపింగ్ యార్డుషో ఫిట్‌ను పరిశీలించారు. తడిచెత్త పోడి చెత్త వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. పారిశుధ్యం తడి, పొడిచెత్తపై ప్రజలకు అవగహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ అధికారులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు సందర్శించి పారిశుధ్యం లోపించకుండా ప్రతీ రోజు పారిశుధ్య పనులు చేయించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సంతోష్ కుమార్, ఈవో సంజీవ్ రావు, మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్ రావు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



రాష్ట్రస్థాయిలో ఆదిలాబాద్ బల్దియాకు తొమ్మిదో ర్యాంకు

ఆదిలాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం ప్రతీయేటా ప్రక టించే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో ఆదిలాబాద్ మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు రాగా జాతీయ స్థాయిలో 151వ స్థానం దక్కించుకుంది. పట్టణ పరిశుభ్రత, ఓడీఎఫ్, ప్రజాభిప్రాయ సేకరణలో మున్సిపాలిటీకి మెరుగైనా ఫలితాలు వచ్చాయి. దేశవ్యాప్తంగా లక్ష జనాభాకు పైగా ఉన్న 446 మున్సిపాలిటీలు పాల్గొనగా ఆదిలాబాద్ మున్సిపాలిటీకి 151వ ర్యాంకు, రాష్ట్ర వ్యాప్తంగా లక్షకు పైగా జనాభాఉన్న 11 మున్సిపాలిటీల్లో ఆదిలాబాద్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి మెరుగైన ర్యాంకులు రావడంపై మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కమిషనర్ శైలజలు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

22న సెలవు ప్రకటించాలని కలెక్టర్‌కు వినతి

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి11: ఈనెల 22న రామ మందిర ప్రాణ ప్రతిష్ట సందర్భంగా జిల్లాలో ఆ రోజు సెలవును ప్రకటించాలని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి కలెక్టర్‌కు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లను కలిసి వినతిపత్రం అందించారు. రామ మందిర ప్రాణప్రతిష్ట రోజు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించేలా చూడాలని కోరారు. అలాగే వివేకానంద జయంతికి హాజరుకావాలని పట్టణ యువజన సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఆహ్వానపత్రికను అందించారు.

వివేకానందుని జీవితం నేటి తరానికి ఆదర్శం

బోథ్, జనవరి 11: వివేకానందుని జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలని నాగభూషణం పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో వివేకానందుని జయంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వివేకానందుని వేషధారణలో ఆకట్టుకున్నారు.

ఏకగ్రీవంగా గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

నేరడిగొండ, జనవరి11: కుమారి గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి అధ్యక్షుడిగా పొట్టవతి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కూననడ్పెన్న, కోశాధికారిగా చంద్రసాంరావ్, రైటర్‌గా బిక్కిరాకేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కుమారి సర్పంచ్ రాజుయాదవ్, గ్రామాభివృద్ధి కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

అడెల్లి రోడ్డు ఘాట్ కటింగ్ పనులు చేపట్టాలి: ఎమ్మార్పీఎస్

బోథ్, జనవరి 11: బోథ్ మండలం మీదుగా నిర్మల్ జిల్లాలోని అడెల్లి దేవస్థానం వరకు నిర్మిస్తున్న రోడ్డుపైన ఘాట్ కటింగ్ పనులను భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా నిర్వహించే విధంగా సంబంధిత కాంట్రాక్టర్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మార్పీఎస్ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడాల స్వామి నిర్మల్ ఎమ్మెల్యేకు వినతిప్రతం అందించారు. రోడ్డుకోసం చేపట్టిన ఘాట్ కటింగ్ తండా వద్ద ప్రమాదకరంగా ఉందని వర్షాకాలంలో కొండ చర్యలు విరిగి పడి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. వర్షాకాలంలో ఈరూట్‌లో ప్రయాణించే వారికి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ముందు చూపుతో వ్యవహరించకపోతే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయనవెంట జిల్లా అధ్యక్షులు వెంకటేష్ మాదిగ, నిర్మల్ జిల్లా నియోజకవర్గ కన్వీనర్ రవిమాదిగ, నిర్మల్‌జిల్లా నాయకులు రాజు మాదిగ, ఆదిలాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ బోథ్ మండల నాయకులు కారం రవి, వన్నెల అశోక్‌లు ఉన్నారు.



ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

ప్రజాపాలన దరఖాస్తులను తప్పుల్లేకుండా ఆన్‌లైన్ చేయాలి

బోథ్, జనవరి 11: ప్రజాపాలనలో భాగంగా వివిధ గ్రామాల ప్రజలు సమర్పించిన దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలని నోడల్ అధికారి డీఎస్‌వో శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పులు దొరకకుండా ప్రతీఒక్క దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఆయనవెంట ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఎంపీఈవో జీవన్ రెడ్డి, సూపరింటెండెంట్, సిబ్బంది ఉన్నారు.

'రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి'



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

భీంపూర్, జనవరి11: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రమేష్ కు టుంబాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పరామర్శించారు గురువారం పిప్పల్‌కోటిలో బాధిత కుటుంబాన్ని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అన్న మొల్ల కిరణ్, బొజ్జ ఆశన్నలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడు అప్పుల బాధతో రమేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఆయన ఈ కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబానికి మూడెకరాల భూమి, రూ.25లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పెంటరాజరెడ్డి, పీర్ మహ్మద్, ఫరీద్, రమేష్‌రెడ్డి, హైదర్‌లు ఉన్నారు.

అమరుల చరిత్ర నేటితరానికి తెలియాలి

- అందుకే జయంతి వేడుకలు: కలెక్టర్ రాహుల్‌రాజ్
- గత ప్రభుత్వ హయాంలో ఒడ్డెర కులస్థులకు అన్యాయం: ఎమ్మెల్యే పాయలశంకర్



వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



పాల్గొన్న అధికారులు, సంఘం నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి 11: సమాజ హితం కోసం మహనీయులు చేసినకృషి నేటి తరానికి తెలిపేందుకే వారి జయంతులను ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారికంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న 217వ జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి కలెక్టర్ పూజలుచేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఓబన్న చేసినసేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఒడ్డెర సంఘం నాయకులు వారి సమస్యలను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషిచేస్తామని హామీఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ సమాజ హితం, తెలంగాణ, స్వతంత్ర్యం కోసం పోరాడి అమరులైన వారి జీవిత చరిత్రలు నేటి తరం యువతకు తెలిపేందుకేవారి జయంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. అదే కోవలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా వడ్డె ఓబన్న పోరాడారని తెలిపారు. వడ్డెర సంఘం నాయకులు పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. తన పరిధిలో ఉన్న వాటిని తక్షణమే పరిష్కరిస్తానని కలెక్టర్ తెలిపారు. మిగితా సమస్యల కోసం ప్రభుత్వానికి నివేదికను అందిస్తానన్నారు. ఓబన్నను స్ఫూర్తిగా తీసుకుంటూ ప్రతీఒక్కరు ఐక్యంగా కృషిచేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వడ్డెరకులస్థులకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మైనింగ్‌శాఖ ద్వారా క్వారీల టెండర్లలో వడ్డెర కులస్థులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సంఘ భవనం కోసం నిధులు ఇస్తానని హామీఇచ్చారు. అదేవిధంగా పీఎం నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన విశ్వకర్మ యోజన పథకంలో ఎలాంటి పూచీకత్తు లేకుండా 3లక్షల వరకు రుణాలు పొందొచ్చని తెలిపారు. కుల వృత్తులు చేసుకునే వడ్డెర కులస్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అధికారులు రాజలింగు, రాథోడ్‌రమేష్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాలదత్తు, కలల శ్రీనివాస్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఓబన్న జయంతి

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామ వడ్డెరసంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న 217వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గణేష్‌రెడ్డి హాజరై ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో సైరానరసింహారెడ్డితో వడ్డెర ఓబన్న కలిసి బ్రిటీష్ వారితో పోరాడారని కొనియాడారు. రుయ్యాడిలో వడ్డసంఘ భవనం నిర్మాణంలో ఉందని, త్వరలోనే పూర్తిచేసి ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్‌యాదవ్, కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, తదితరులున్నారు.



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న డీఎస్‌వో

లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం ఇవ్వండి

- చెత్తాచెదారంతో ఉన్న బియ్యాన్ని పంపండి: డీఎస్‌వో

బోథ్, జనవరి 11: రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం అందించాలని డీఎస్‌వో శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రేషన్ షాపులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకమైన బియ్యం వస్తే లబ్ధిదారులకు ఇవ్వొద్దని, చెత్తాచెదారం ఉన్న బియ్యం వస్తే పక్కనపెట్టి రిటర్న్ పంపించాలని చెప్పారు. డీలర్లు ఎక్కడైనా చెత్తాచెదారంతో కూడిన బియ్యం ఇస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ శ్యామ్‌సుందర్ ఉన్నారు.

పూసాయి ఎల్లమ్మ మహాజాతర ప్రారంభం

- ఎల్లమ్మకు బోనాలు సమర్పించిన పూసాయి గ్రామస్థులు
- నెల రోజుల పాటు కొనసాగనున్న జాతర

జైనథ్, జనవరి11: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న జైనథ్ మండలంలోని పూసాయి గ్రామంలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే పుష్యమాసం నుంచే మాగమాసం వరకు నెలరోజుల పాటు కొనసాగే పూసాయి ఎల్లమ్మ (రేణుక) మాత జాతర గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పూసాయి గ్రామ ప్రజలు మహిళలు ఇంటి ఆడపిల్లలు మట్టితో చేసిన బోనం కుండలను వివిధ వంటకాలతో చేసిన నైవేద్యాలను తలపై పెట్టుకుని డప్పుల భజాల మధ్య ఊరేగింపుగా నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ తల్లికి నైవేద్యాలను సమర్పించి ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పూసాయి సర్పంచ్ అల్లూరిపోతారెడ్డి, గ్రామపెద్దలు గంగాధర్, బుర్రిసంతోష్, బుద్దె రమేష్, సల్వార్ నవీన్, బర్కుంటి అశోక్, బుద్దెచిన్నరమేష్, తొగరి కేశవ్‌లతో పాటు పూసాయి గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఉట్నూర్, జనవరి11: ఆధ్యాత్మిక మార్గంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పూలాజి బాబాధ్యాన మందిరం అధ్యక్షుడు ఇంగ్లేకేశవ్ అన్నారు. గురువారం మండలంలోని సాలెగూడలో నిర్వహించిన పూలాజి బాబాధ్యాన మందిరం వార్షికోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ఆలయం ముందు ధ్వజరోహణ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టేకం మోకాషి, మోకాడే విష్ణు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులున్నారు.

జిల్లాలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ఆదిలాబాద్‌అర్బన్: పట్టణంలోని సీబీఆర్ మోడల్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోగిమంటలు వేసి గొబ్బెమ్మలకు పూజలు చేసి పండుగను తలపించేలా కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పండుగ విశిష్టతను తెలియజేయడానికి వేడుకలను నిర్వహించామని పాఠశాల కరస్పాండెంట్ శోభ తెలిపారు. అలాగే లిటిల్‌స్టార్ పాఠశాలలోనూ సంక్రాంతి వేడుకలను నిర్వహించారు.

తలమడుగు, జనవరి11: మండలంలోని కజ్జర్ల ప్రాథమిక పాఠశాలలో పిల్లలు ఉపాధ్యాయులు పాఠశాలలో అంగరంగ వైభవంగా సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి ఉపాధ్యాయులు లలిత, రాజు, నాగేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవులకు

ఇంటిబాట పట్టిన విద్యార్థులు

● రద్దీగా మారిన ప్రయాణ ప్రాంగణం

భైంసా, జనవరి 11: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించడంతో హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులంతా గురువారం ఇంటిబాట పట్టారు. సాయంత్రం విద్యాసంస్థల పనివేళలు ముగియగానే విద్యార్థులు తమ స్వగ్రామాలకు తరలివెళ్లారు. స్థానిక బస్టాండ్, ప్రైవేట్ వాహనాల పార్కింగ్ స్థలాలు విద్యార్థులు, వారి తల్లితండ్రులతో కిక్కిరిసిపోయింది. విద్యాశాఖ ఆదేశాలమేరకు విద్యాసంస్థలు సంక్రాంతి సెలవులు ముగియగానే ఈనెల 18న పునఃప్రారంభం కానున్నాయి.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



హరిదాసు, గంగిరెద్దుల వేషధారణతో విద్యార్థులు

భైంసా, జనవరి11: పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల్లో గురువారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు ఆహుతులను అలరారించాయి. విద్యార్థులు బోగి, కనుమ, సంక్రాంతి పర్వదినాల ప్రాశాస్త్యన్ని వివరిస్తూ ప్రదర్శనలిచ్చారు. ఉదయం ప్రారంభమైన వేడుకలు సాయంత్రం వరకు సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు అనుగుణంగా కొనసాగాయి. బోగి మంటలు వేయడం మొదలుకొని నోములు పంచుకునే వరకు చేపట్టిన కార్యక్రమాలు ఆద్యంతం అందరిని ఆకట్టుకున్నాయి. గంగిరెద్దు వేషాధారాణలతో విన్యాసాలు, హరిదాసు వేషాదారణతో కీర్తనల చేపట్టిన విద్యార్థులు ప్రదర్శనలు అందరి మన్ననలు పొందాయి. వ్యవసాయ దిగుబడులు ఇంటికి తీసుకవచ్చి నిల్వ చేయడం, కట్టెల పోయ్యిపై పాలు పొంగించడం, చిన్నారులకు పోసే బోగి పళ్లు, గొబ్బెమ్మ పూజలు, నోము వ్రతం, బసవన్నల పూజలు తదితర వాటిని కన్నులకు కట్టినట్లుగా ప్రదర్శించాయి. బోగిమంటలు వెలిగించి విద్యార్థులు చుట్టూప్రదర్శనలు నిర్వహిస్తూ చేపట్టిన నృత్యాలు వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కుభీర్ : మండలకేంద్రంలోని చాణక్యసంస్కృతి పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతులతో భోగిమంటలు, గంగిరెద్దులు, కొత్తధాన్యం పిండివంటలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు ప్రిన్సిపాల్ నరేష్ వివరించారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ పాఠశాలలో గురువారం ముందస్తు పతంగుల వేడుకలను నిర్వహించారు. హెచ్‌ఎం ఎల్లన్న మాట్లాడుతూ జనవరి 14 నుంచి 15 వరకు అంతర్జాతీయ పతంగుల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని, సంక్రాంతి సెలవుల కారణంగా ఈరోజు ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. విద్యార్థులందరికీ గాలిపటాలు అందించి గాలిపటాలు ఎగురవేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● వాసవి కళాశాలలో..

మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్‌లు సాయిలు, శ్రీనివాస్, కరస్పాండెంట్ జానకిరామ్, హరిప్రసాద్‌లు, ఉపాధ్యాయులు పాల్గొని సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గులు, గంగిరెద్దుల ఆటలు, పాటలు, గొబ్బెమ్మలు బోగి మంటలు తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు.

● విన్నర్స్ స్కూల్‌లో..

నిర్మల్ కల్చరల్: నిర్మల్‌లోని విన్నర్స్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకలలో భాగంగా విద్యార్థినులు తీర్చిదిద్దిన రంగురంగుల ముగ్గులను చూపరులను ఆకట్టుకున్నాయి. గురువారం ముంస్తు సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. పాఠశాలలో భారతదేశ సంప్రదాయ దినోత్సవాన్ని నిర్వహించి సంస్కృతి, సంప్రదాయాల విలువలు విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. విద్యార్థులకు ముగ్గులు, కైట్స్ పోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. కరస్పాండెంట్ దాసరి రాజు, చైర్మన్ కే. ప్రసాద్, డైరెక్టర్లు శ్రావణ్, శిరీష్, ప్రిన్సిపాల్ దినేష్ పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

ఐఎస్ఎల్‌కు సిద్ధమవుతున్న ఉట్నూర్

● ఈనెల 17 నుంచి నాలుగు రోజుల పాటు క్రీడాపోటీలు ● కొమురంభీం ప్రాంగణంలో చకచకా సాగుతున్న క్రీడా మైదాన సుందరీకరణ పనులు


భీమ్ విగ్రహం వద్ద సుందరీకరణలో భాగంగా మొక్కలు నాటుతున్న దృశ్యం


ఉట్నూర్‌లో ఐఎస్ఎల్ పోటీలకు సిద్ధమవుతున్న క్రీడా మైదానం

ఉట్నూర్, జనవరి 11: ఉట్నూర్ సమగ్ర గిరిజ న అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇంటర్ సొసైటీ లీగ్ (ఐఎస్ఎల్) పోటీలకు ఉట్నూర్ మండలకేంద్రంలోని కొమురం భీం ప్రాంగణం సిద్ధమవుతోంది. ఈనెల 17 నుంచి 20 వరకు నాలుగు రోజులపాటు జరుగనున్న క్రీడ పోటీల కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌బాజ్ పేయ్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు రాథోడ్‌భీమ్‌రావు, శివప్రసాద్, రాథోడ్ ఇందల్‌లు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, గిరిజన సంక్షేమశాఖ జిల్లా క్రీడల అధికారి కొరెడ్డి పార్థసారథి నేతృత్వంలో పనులు కొనసాగుతున్నాయి. సుమారు 5000 మంది క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు అధికారులు హాజరుకానున్న ఐఎస్ఎల్ పోటీలకు కావాల్సిన ఏర్పాట్లను క్రీడా మైదానాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

రూ. 20 లక్షలతో పనులు

ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న ఐఎస్ఎల్ పోటీలు నిర్వహణకు సుమారు రూ.20లక్షలతో ఇంజనీరింగ్ అధికారులు పనులు చేపడుతున్నారు. హాకీ, ఫుట్‌బాల్, జావెలిన్‌త్రో క్రీడా మైదానాలతోపాటు వాలీబాల్, కబడ్డీ అథ్లెటిక్స్ పోటీలకు కావాల్సిన క్రీడా మైదానాలు సిద్ధం చేస్తున్నారు.

రూ.1.80 లక్షలతో సుందరీకరణ

ఐఎస్ఎల్ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానితులతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఉన్నతాధికారులు హాజరయ్యే అవకాశాలు ఉండడంతో రూ.1.80 లక్షలతో కొమురంభీం ప్రాంగణంలో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఐటీడీఏ పండ్లతోటల ఉద్యానవనాధికారి సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ ఆదేశాలకు అనుగుణంగా కొమురంభీం ప్రాంగణంలోని ఎంట్రన్స్ గేట్ నుంచి పీఎంఆర్సీ విశ్రాంతి గృహం వరకు, పీఎంఆర్సీ సమావేశం హాల్ వరకు రెండు వైపుల పూల మొక్కలు, కోట్రన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల ఆరాధ్య దైవం జల్ జంగల్ జమీన్ పోరాట వీరుడు కొమురంభీం విగ్రహం వద్ద కూడా పూల మొక్కలు కోట్రన్స్ ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా కొమురంభీం ప్రాంగణం అర్చరీ గేటు వద్ద బోర్డును రాయించడంతో పాటు లోపలికి వస్తుండగా ఉన్న బాహ్యగోడలకు రంగులు వేస్తున్నారు. సుందరీకరణ అందరినీ ఆకట్టుకోనున్నారు.

పాల్గొననున్న 5వేల మంది క్రీడాకారులు

ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ, తెలంగాణ సాంఘీక సంక్షేమ శాఖ, ఆదర్శ క్రీడా పాఠశాలలు, మైనారిటీ సంక్షేమ శాఖ, ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, మహాత్మా జ్యోతిబాఫూలే ఇలాంటి సొసైటీలకు చెందిన ప్రతిభ ఉన్న క్రీడాకారులు 5000 మంది ఐఎస్ఎల్ పోటీలకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన ఆహారం, మంచినీరు, వైద్యం లాంటి సౌకర్యాలు అందించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని క్రీడాకారులకు మెరుగైన భోజన వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తు కూడా చేయాలని పోలీసు శాఖను కోరారు.


ఎమ్మెల్యేకు మెమొంటో అందిస్తున్న బ్రహ్మకుమారి

ప్రజాసేవ చేసేందుకు ఆధ్యాత్మికత అవసరం

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి 11: రాజకీయ నాయకుడు నిస్వార్థ ప్రజాసేవ చేసేందుకు ఆధ్యాత్మికత కచ్చితంగా అవసరమని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం బ్రహ్మకుమారి సమాజం (ఓంశాంతి) నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచేందుకు మానసిక స్థైర్యాన్ని, ధైర్యాన్ని ఆధ్యాత్మిక మార్గమే అందించిందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి రేవతి, రాము, అరుణ్, రాంనాథ్, జిల్లా నాయకులు లాలామున్నా, ఆదీనాథ్, జోగురవి, కార్యకర్తలు ఉన్నారు.

జలకోరి, గుబ్‌డిపల్లిలో కలెక్టర్ పర్యటన

భీంపూర్, జనవరి11: మండలంలోని జలకోరి, గుబ్‌డిపల్లి గ్రామాల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామస్థులు రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరగా.. అందుకు స్పందించిన కలెక్టర్ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆధార్‌కార్డు ప్రతీఒక్కరికి ఉండాలని సూచించారు. ప్రతీఒక్కరు జన్‌ధన్ ఖాతాలు తెరవాలని సూచించారు. అనంతరం పాఠశాలను సందర్శించారు. ఆయనతో ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ కోవ హరిదాస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంకట రమణ, చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ నిఖిల్ రాజ్, సర్పంచ్‌లు నక్క లక్ష్మీ, మాడావి అనిల్, కార్యదర్శులు అజయ్‌రెడ్డి, జలేందర్ తదితరులు ఉన్నారు.

సమాజ్ అభివృద్ధికి పాటుపడాలి

● ఆదివాసి పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీ నేతలు

మావల, జనవరి11: ఆదివాసి పర్ధాన్ సమాజ్ అభివృద్ధిలో పర్ధాన్ కులస్థులు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆదివాసి సమాజ్ అడహక్ కమిటీ జిల్లా నాయకుడు పూసం ఆనంద్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసి పర్ధాన్ సమాజ్ జిల్లా, డివిజన్ కమిటీల ఎన్నికల్లో భాగంగా మండల కమిటీ ఎన్నికలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల కమిటీలను నియమించినట్లు చెప్పారు. అందులో భాగంగానే ఈనెల 12న మావల మండల కమిటీ ఎన్నిక యథావిధిగా కొనసాగుతుందన్నారు. భీంపూర్ మండల ఎన్నిక కమిటీ సమావేశాన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి మాసంలో నిర్వహించే హీరాసుక్కా జయంతి వేడుకల సందర్భంగా ఇంద్రవెల్లిలో ఈనెల 13న సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సభ్యులు సెడ్మకి సుభాష్, ఆత్రం అనసూయ, మడావి దిగంబర్, గేడం మాధవ్, ఆర్క శేషరావు, మెస్రం భాస్కర్, గేడం విఠల్, తదితరులు ఉన్నారు.

గురుబాబా మందిరంలో అన్నదానం

నేరడిగొండ, జనవరి 11: గురుకృప దివస్‌ను పురస్కరించుని గురుబాబా మందిరంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మండలంలోని రోల్‌మామడ గ్రామపరిధిలో ఉన్న శ్రీగురుబాబా ఆలయంలో కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితో పాటు ఎంపీపీ సజన్‌రాథోడ్, సర్పంచ్ గీతకరణ్‌సింగ్, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

'కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ నిర్మించండి'

బోథ్, జనవరి 11: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల చుట్టూ కూలిపోయిన ప్రహరీని నిర్మించాలని బోథ్ మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు జక్కుల వెంకటేష్ అధికారులను కోరారు. అలాగే పాఠశాల పక్కన ఉన్న పల్లెప్రకృతి వనానికి స్లైనగేటు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుగా మారిందన్నారు. అధికారులు జోక్యం కల్పించుకుని ప్రహరీ నిర్మాణంతోపాటు పల్లెప్రకృతి వనానికి కంచెను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

వేతనాలు విడుదలచేయాలి

తానూర్, జనవరి 11 : గత రెండు నెలలుగా పెండింగ్‌లో సమగ్ర శిక్షణ ఉద్యోగుల వేతనాలవెంటనె విడుదల చేయాలని ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. భూమన్నయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఏల్వి పాఠశాలలో సంస్థ కాలసూచికను ఆవిష్కరించి మాట్లాడారు. ఈమేరకు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష పరిధిలో పని చేసే ఉద్యోగులు డీఈవో కార్యాలయ సిబ్బంది పీఆర్‌సీ సిబ్బంది కేజీబీవీలలో పని చేసే ఉద్యోగ ఉపాధ్యాయులకు గత రెండునెలల వేతనాలు ఇప్పటి వరకు విడుదల చేయపపోవడం సరికాదని, దీని వలన ఉద్యోగులు చాల ఇబ్బందుక గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేందర్‌కుమార్, ఉపాధ్యాయులు గంగారాణి, మాదవరావు, సుదర్శణ్, వెంకటేశ్, హరీష్, గీత, హజారే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఎంట్రన్స్ పుస్తకాల పంపిణీ

ఖానాపూర్, జనవరి 11 : మండలంలోని సుర్జాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు సుద్దాల మహిపాల్ ఆధ్వర్యంలో ఉచితంగా గురుకుల ఎంట్రన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు ఉచితంగా గురుకుల ఎంట్రన్స్ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేసిన మహిపాల్‌ను పలువురు అభినందించారు. నిరుపేద విద్యార్థులకు సహకరించాలని ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది తాను ఉచితంగా గురుకుల పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు మహిపాల్ పేర్కొన్నారు.

రైతుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతు

దిలావర్‌పూర్, జనవరి 11 : గుండంపెల్లి - దిలావర్‌పూర్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని రైతులు చేస్తున్న ఉద్యమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి పరిశ్రమ నిర్మిస్తున్న భూములను పరిశీలించారు. పరిశ్రమను రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని రైతులు కలిసి వినతి పత్రం ఇచ్చినప్పటికీ సానుకూలంగా స్పందించిన సీఎం ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. అలాగే నిర్మల్ పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కను కలిసి రైతులు ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని కోరినప్పటికీ ఎలాంటి హామీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. తన ప్రసంగంలో కనీసం ఇథనాల్ సమస్యలను మంత్రి ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. ఇథనాల్ పరిశ్రమ రద్దయ్యే వరకు రైతులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బర్కుంట నరేందర్, మిట్టపల్లి రాజేందర్, ఉంగరాల రాజు, ఠాకూర్ అర్జున్, కోడి ముత్యం, గోపు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా


పరిశ్రమ నిర్మాణ ప్రదేశంలో యువకులతో మాట్లాడుతున్న నాయకులు

జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెల్లడి

దిలావర్‌పూర్, జనవరి 11 : మండలంలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ రద్దు కోసం తనవంతు కృషి చేస్తానని జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం గుండంపెల్లి గ్రామ పరిసరాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ ప్రదేశాన్ని స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామ యువకులు ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తే భవిష్యత్తులో జరిగే ఇబ్బందులను, సమస్యలను పత్తిరెడ్డికి వివరించారు. తప్పుడు అనుమతులతో పచ్చని పంట పొలాల్లో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి నా వంతుగా కృషి చేస్తానని స్థానిక రైతులకు రాజేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు.

నిజాయితీ చాటుకున్న ఏరియా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది

భైంసా, జనవరి 11 : పట్టణంలోని ఏరియా ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులు నిజాయితీ నిలువుటద్దంలా నిలుస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎవరు ఎలాంటి వస్తువులు పోగొట్టుకుంటున్న తమకు దొరికితే బాధితులకు అందించి ఆదర్శంగా నిలుస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చికిత్స కోసం ముథోల్ మండలంలోని చించాల గ్రామానికి చెందిన శ్రీజ అనే రోగి రూ. 3800 నగదు పోగొట్టుకుంది. విధుల్లో ఉన్న సెక్యూరిటి గార్డు అన్వర్‌ఖాన్‌కు దొరకగా.. నిజాయితీగా తనకు దొరికిన నగదు శ్రీజకు అప్పగించాడు. తాజాగా గురువారం కుభీర్ మండలం నిగ్వ గ్రామానికి చెందిన అమృత అనే రోగి రూ. 13వేల నగదును పోగొట్టుకోగా.. విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు లక్ష్మీకి ఆ నగదు దొరకగా, నిజాయితీ అమృతకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులను ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. కాశీనాథ్ గురువారం సన్మానించి అభినందించారు. ఎమ్మెల్యే సైతం ఫోన్‌లో వారిని అభినందించారు.


సెక్యూరిటీ గార్డులను సన్మానిస్తున్న దృశ్యం

అటవీ సంపదను కాపాడటం అందరి బాధ్యత

పెంబి, జనవరి 11 : అటవీ సంపదను కాపాడటం అందరి బాధ్యత అని పెంబి రేంజ్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రతాప్‌నాయక్ అన్నారు. గురువారం పెంబి మండలంలోని లోతర్య తండా, గుమ్మెన, ఎంగ్లాపూర్ గ్రామాల్లో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, అడవిలో అగ్ని ప్రమా దాల నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. వన్య ప్రాణులను వేటాడటం, అడవిలో నిప్పు పెట్టడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అడవి సంపదను కాపాడటం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ కింగ్ ఫిషర్, లచ్చన్న, బీట్ అధికారులు సంతోష్, ఉదయ్ కుమార్, శివ, మనోహర్, తదితరులున్నారు.

నువ్వు విత్తనాల సాగుపై అవగాహన

ఖానాపూర్, జనవరి 11 : మండలంలోని బావాపూర్(ఆర్) తండాలో గురువారం నువ్వు పంట సాగు, నువ్వు విత్తనాల పంపిణీపై మండల వ్యవసాయ అధికారి ఆసం రవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాజన్నకి చెందిన భారతీయ నునే గింజల పరిశోధన స్థానం, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ హైదరాబాద్ వ్యవసాయ శాఖ నిర్మల్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నువ్వు పంట సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు పేర్కొన్నారు. జగిత్యాలకు చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అభివృద్ధి చేసిన జేసీఎస్ 1020 రకం నువ్వు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన


కుభీర్, జనవరి 11 : మండలంలోని రంజిని గ్రామంలో భైంసా వేదం పాఠశాల విద్యార్థులకు గ్రామదర్శినిలో భాగంగా గురువారం ఏఈవో రమేష్ సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి విద్యార్థి పాటు పడాలన్నారు. రసాయన ఎరువులు వాడడం వలన బూసారం కోల్పోతుందని సేంద్రియ ఎరువులతో పంట నేల పండించాలని పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పర్యావరణాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవాలని, పర్యావరణంలో జరిగే ప్రతి మార్పుకు సైంటిఫిక్ రిజన్ ఉంటుందని, విద్యార్థులు గమనించి తమ అభ్యసనను వృద్ధి చేసుకోవాలన్నారు.

లింబా(కె)లో క్రికెట్ పోటీలు ప్రారంభం

కుంటాల, జనవరి, 11 : కుంటాల మండలంలోని లింబా (కె) గ్రామంలో గురువారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు. సర్పంచ్ ఆనంద్ రావు, వీడీసీ చైర్మన్ ఆనంద్ రావు, డైరెక్టర్ గోనె గజ్జారాం పాల్గొని క్రికెట్ పోటీలను ప్రాంభించారు. గడ్డం ద్రుపతయ్య మేర ,లక్ష్మణ్‌ల జ్ఞాపకార్థం 17 వ ఎల్‌పీఎల్ క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ వైస్ చైర్మన్ సాయిలు, దత్తు పటేల్, ఎల్‌పీఎల్ చైర్మన్ మల్లారెడ్డి, వైస్ చైర్మన్ అశోక్ రెడ్డి, మెనెజ్‌మెంట్ సభ్యులు ఆకాష్, రవి, దత్తు, సాయి తదితరులు ఉన్నారు.

జాతరల సీజన్ వచ్చేసింది!

● ఈనెల 12 నుంచి జగదంబా దేవి జాతర ● 12న మహాదేవ్ ఆలయంలో.. ● 25 నుంచి కాందేవ్ జాతర


కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం


ఆలయంలోని నాగోబా విగ్రహం

ఉట్నూర్, జనవరి11: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో జాతర్ల సీజన్ రానే వచ్చింది. ప్రకృతిని ఆరాధ్య దైవంగా పూజించే ఆదివాసీ గిరిజన ప్రాంతాల ప్రజలు తమ ఆచార సాంప్రదాయ సాంస్కృతిలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాల పండుగలను పురస్కరించుకుని ఏజెన్సీ ప్రాంతాలలో గత దశాబ్దాలుగా జాతరలు కొనసాగుతూ వస్తున్నాయి. ఉమ్మడి సిరిపూర్(యూ) మండలంలోని లింగాపూర్‌లో కొలువుదీరిన జగదాంబ దేవి ఆలయం ఆవరణలో జరిగే తొలిజాతర నుంచి ఏజెన్సీలో జాతరలు మొదలుకానున్నాయి. ఈనెల 12 నుంచి జగదాంబ దేవిజాతర ప్రారంభం కానుండగా ఉట్నూర్ మండలంలోని సాలెవాడలో కొలువుదీరిన మహాదేవ్ ఆలయం ఆవరణలో ఈ నెల 17 నుంచి జాతర ప్రారంభంకానుంది. అదే విధంగా నార్నూర్ మండల కేంద్రంలోని తొడసం వంశీయుల కాందేవ్‌జాతర ఈ నెల 25 నుంచి ప్రారంభంకానుంది. తొడసం వంశీయులకు చెందిన ఆడపడుచు రెండు కిలోల నువ్వుల నూనె తాగడం ఇక్కడ నాటి నుంచి నేటి వరకు ఆదివాసీ గిరిజనులు ఆనవాయితీగా కొనసాగిస్తూ వస్తున్నారు. ఫిబ్రవరి 9న పుష్యమి అమావాస్య నుంచి ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో కొలువైన మేస్రం వంశీయుల ఆరాధ్య దైవం నాగోబా మహాపూజతో జాతర ప్రారంభం కానుంది. నాగోబా జాతర ఏర్పాట్ల కోసం ఐటీడీఏ అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీఓ చాహత్‌బాజ్‌పేయ్ ఆధ్వర్యంలో సమావేశమై ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ నెల 14న మేస్రం వంశీయులు చకడ (బండి) ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కాలినడకన జన్నారం మండలం కలమడుగు వద్ద ఉన్నగోదావరికి వెళ్లి పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం కలశంలో పవిత్ర గోదావరి జలాలు సేకరించి కాలినడకన తిరిగి కేస్లాపూర్‌లోని మర్రిచెట్టు వద్దకు చేరుకుని బస చేస్తారు. మూడు రోజుల పాటు మేస్రం వంశీల ఆచార సాంప్రదాయాలతో పూజలు ప్రారంభించాక మహాపూజతో నాగోబా జాతర ప్రారంభమవుతుంది. నాగోబా జాతర తర్వాత ఆరు రోజులకు ఉట్నూర్ మండలంలోని షాంపూర్‌లో కొలువుదీరిన మేస్రం గిరిజనుల దైవం భుడుందేవ్‌కు పూజలు నిర్వహించి షాంపూర్ జాతరను ప్రారంభిస్తారు. ఈ జాతర 10 రోజుల వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత సిర్పూర్(యూ) మండల కేంద్రంలోని మహాదేవ్ ఆలయంలో గిరిజనుల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22 నుంచి జాతర కొనసాగుతుంది. ఆ తర్వాత పది రోజులకు కెరమెరి మండల కేంద్రంలోని బాలాజి మందిరం వద్ద జాతర ప్రారంభం కానుంది. ఈ జాతరలకు ప్రజలు అధికసంఖ్యలో హాజరవుతారు.

ఆస్తి పన్ను చెల్లించలేదని

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సీజ్

నిర్మల్ కల్చరల్, జనవరి 11 : ఆస్తిపన్ను బకాయిలు చెల్లించని కారణంగా గురువారం నిర్మల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. అద్దె గృహంలో కొనసాగుతుండగా యజమాని లక్ష 57 వేల రూపాయల ఆస్తి పన్ను చెల్లించని కారణంగా కార్యాలయాన్ని సీజ్ చేసినట్లు ఆదిలాబాద్ మున్సిపల్ ఆర్ఐ గంగాధర్ తెలిపారు.

లోక్‌సభ సీటుపై మూడు పార్టీల గుబులు




రమేష్‌రాథోడ్, బీజేపీ | రాజేశ్‌బాబు, బీజేపీ | రేఖానాయక్, కాంగ్రెస్ | శ్యాంనాయక్, కాంగ్రెస్ | జాన్సన్‌నాయక్, బీఆర్‌ఎస్



- కాంగ్రెస్, బీజేపీల్లో పోటాపోటీ
- బీఆర్‌ఎస్ తరపున కూడా ఆసక్తిచూపుతున్న ఓ ఎన్‌ఆర్‌ఐ నేత
- ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్న జిల్లా గిరిజన నేతలు
- తెర వెనుక ఇప్పటి నుంచే మొదలైన సమీకరణాలు

నిర్మల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు గిరిజన నేతలు పోటాపోటీగా కార్యకలాపాలు మొదలుపెట్టడం ఆసక్తికరంగా మారుతోంది. ఈ నేతలంతా ఎలాగైనా తమకే టికెట్‌లు దక్కే విధంగా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుండడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. మొన్నటి వరకు గిరిజన ప్రాంతాల నుంచే అభ్యర్థులు పోటీ చేసేందుకు ఆసక్తి చూపేవారు. అయితే ఈ సారి మాత్రం ప్లెయిన్ ఏరియా జిల్లాగా ఉన్న నిర్మల్‌లోని పలు గిరిజన ప్రాంతాలకు చెందిన నాయకులు ఎలాగైనా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తుండడం అంతటా చర్చకు తావిస్తోంది. మొన్నటి ఆసెంబ్లీ ఎన్నికల్లో రెండు శాసనసభ స్థానాలను బీజేపీ పార్టీ గెలుచుకోవడంతో ఈ సారి ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు జిల్లా నేతలు ఉత్సాహం చూపుతున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కారణంగా తమకు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయంటూ ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు భావిస్తున్నారు. కాగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సైతం పోటీ చేసేందుకు ఒకరిద్దరు నేతలతో పాటు ఓ ఎన్‌ఆర్‌ఐ కూడా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారంటున్నారు. ఇలా నేతలంతా ఎవరికి వారే తమదైన శైలిలో లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతుండడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారుతోంది. కాగా జిల్లాలో బీజేపీ పవనాలు బలంగా వీస్తుండడమే కాకుండా ప్రస్తుతం ఆ పార్టీకే సిట్టింగ్ ఎంపీ ఉన్న కారణంగా ఆ ప్రభావం కూడా ఈ సారి గెలుపుపై ఉంటుందని ఆ పార్టీ తరపున పోటీ చేసేందుకు ఆసక్తిచూపుతున్నవారు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే బీజేపీ నుంచి మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ అలాగే ముథోల్ నియోజక వర్గానికి చెందిన భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబులు ముమ్మరంగా పోటీ పడుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాజేశ్‌బాబు సోషల్ మీడియాను అస్త్రంగా చేసుకుంటూ ఇప్పటి నుంచే విస్తృత ప్రచారాన్ని చేపట్టారంటున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్ గెలుపు కోసం రాజేశ్‌బాబు విశేషంగా కృషి చేయడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా కీలకపాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా ఆయన వ్యవసాయశాఖ అధికారి ఉద్యోగాన్ని కూడా వదులుకున్నారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న రాజేశ్‌బాబు ఈ సారి ఎలాగైనా తనకే టికెట్ దక్కవచ్చన్న ధీమాలో ఉన్నారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డితో పాటు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ల అండదండలతో టికెట్ దక్కించుకునేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ నుంచి భైంసాకు చెందిన ఐఆర్‌ఎస్ అధికారి ప్రకాష్‌రాథోడ్ పోటీకి సన్నద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన రాష్ట్రస్థాయిలో తనకున్న పరిచయాలను అస్త్రంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారంటున్నారు. గత రెండు రోజుల క్రితం నిర్మల్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ప్రకాష్ రాథోడ్ ఇంటికి వెళ్లి ఆయనతో చర్చలు జరిపిన వ్యవహారం సోషల్ మీడియాలో ప్రస్తుతం హాట్‌టాఫిక్‌గా మారింది. కాగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎన్‌ఆర్‌ఐ, మొన్నటి అసెంబ్లీ ఖానాపూర్ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన జాన్సన్‌నాయక్ మరోసారి లోక్‌సభకు పోటీ చేసేందుకు గానూ ఆసక్తి చూపుతున్నారంటున్నారు. బహుజన సమాజ్ పార్టీ నుంచి బన్సీలాల్ రాథోడ్‌లు కూడా పోటీకి సిద్ధమవుతున్నారంటున్నారు. మొత్తానికి మూడు పార్టీలకు చెందిన ఇక్కడి గిరిజన నేతలు లోక్‌సభ స్థానానికి పోటీ పడేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తూ ఇక తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారంటున్నారు.

బీజేపీ నుంచి పోటాపోటీ

కాగా ఈ సారి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నాలుగు ఆసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న బీజేపీ మరోసారి లోక్‌సభ స్థానాన్ని గెలుచుకునేందుకు సీరియస్‌గా పావులు కదుపుతోంది. ఈ పరిణామాన్ని అవకాశం తీసుకుంటున్న జిల్లాకు చెందిన గిరిజన నేతలు ఎలాగైనా బీజేపీ తరపున పోటీ చేయాలని ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. నిర్మల్, ముథోల్, ఆదిలాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గాల్లో ఇటీవలి ఎన్నికలకు గానూ బీజేపీ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందిన సంగతి తెలిసిందే. జిల్లాలో బీజేపీ లోక్‌సభ ఎన్నికలకు గానూ సత్తా చాటే అవకాశాలున్న కారణంగా ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందు కోసం జిల్లాకు చెందిన గిరిజన నేతలు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన పలువురు బీజేపీ గిరిజన నేతలు ఈ సారి ఎలాగైనా టికెట్‌ను దక్కించుకొని ఎంపీగా పోటీ చేయాలని యోచిస్తున్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసి గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే రాథోడ్ రమేష్ మరోసారి బీజేపీ తరపున ఎంపీగా పోటీ చేయాలని ప్రయత్నిస్తున్నారంటున్నారు. మొన్నటి ఆసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఖానాపూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు చేతిలో ఓడిపోయారు. అయితే లోక్‌సభ ఎన్నికలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయన్న ముందస్తు సమాచారంతో రమేష్ రాథోడ్ లోక్‌సభ సీటును ఆశిస్తున్నారు. ఈయనతో పాటు ముథోల్ నియోజకవర్గానికి చెందిన రాజేశ్ బాబు బీజేపీ టికెట్ కోసం అన్ని రకాల ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ఆయన ప్రచారం కొనసాగిస్తూ పార్టీ పెద్దల దృష్టిలో పడేందుకు ప్రయత్నిస్తున్నారంటున్నారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ల అండదండలతో ఈ సారి ఎలాగైనా తనకే టికెట్ దక్కవచ్చన్న ధీమాలో ఉన్నారు. ఇందులో భాగంగానే ఆయన ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్‌ను మొదలుపెట్టారంటున్నారు. ఈ ఇద్దరు నేతలు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తుండడం నిర్మల్ జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతోంది.

కాంగ్రెస్‌లోనూ ముమ్మర ప్రయత్నాలు

ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు అనూహ్యంగా ఆ పార్టీకి సానుభూతి పవనాలు పెరిగిపోయిన కారణంగా ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు జిల్లా గిరిజన నేతలు జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆమె భర్త శ్యాంనాయక్‌తో పాటు ఐఆర్‌ఎస్ అధికారి ప్రకాష్ రాథోడ్‌లు ఈసారి ఎలాగైనా కాంగ్రెస్ టికెట్‌ను దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నారంటున్నారు. వీరంతా సీఎం రేవంత్‌రెడ్డి, గిరిజన తెగకు చెందిన మంత్రి సీతక్కల సహకారం పొందేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదలుపెట్టారంటున్నారు. ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యాంనాయక్, ఆమె భర్త శ్యాం నాయక్‌లు కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారంటున్నారు. వీరిద్దరు మొన్నటి ఆసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మబొజ్జు గెలుపుకు కృషి చేశారు. దీంతో వారు సీఎం రేవంత్‌రెడ్డి అనుగ్రహం పొందేందుకు కూడా పెద్ద ఎత్తున ప్రయత్నాలు సాగిస్తున్నారంటున్నారు. ఇదిలా ఉండగా భైంసా ప్రాంతానికి చెందిన ఐఆర్‌ఎస్ అధికారి ప్రకాష్‌రాథోడ్ కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన బయోడేటాను అందించినట్లు సమాచారం. దీంతో పాటు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మద్దతును కూడా పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారంటున్నారు. గత రెండు రోజుల క్రితం నిర్మల్ పర్యటనకు వచ్చిన సీతక్క ప్రకాష్ రాథోడ్‌ను ఆయన ఇంట్లో కలిసి చర్చలు జరపడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

బీఆర్‌ఎస్ నుంచి జాన్సన్ నాయక్


ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం పొందిన బీఆర్‌ఎస్ పార్టీ నేతలు కనీసం ఈ సారి ఆ పార్టీ తరపున లోక్‌సభ బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతుండడం చర్చకు తావిస్తోంది. మొన్నటి ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన జాన్సన్‌నాయక్ ఈ సారి లోక్‌సభకు పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఆయన బీఆర్‌ఎస్ అధిష్ఠానం దృష్టికి ఈ విషయాన్ని తీసుకుపోయినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. ఆయన తన ఓటమిని లెక్క చేయకుండా ఇంకా నియోజకవర్గంలోనే పర్యటిస్తూ రాబోయే లోక్‌సభ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించారంటున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పోలైన మొత్తం ఓట్ల శాతాన్ని అలాగే గిరిజన ప్రాంతాల్లో పార్టీకి వచ్చిన ఓట్ల శాతాన్ని విశ్లేషించి లోక్‌సభ సభ్యత్వానికి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొంటున్నారు. ఓట్ల శాతం ఆధారంగా గెలుపు అవకాశాలు ఉంటాయని ఆయన భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే మూడు ప్రధాన పార్టీల నుంచి లంబాడా తెగకు చెందిన వారే పోటీకి ఆసక్తి చూపుతుండడంతో ఆయా పార్టీలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయోనన్న చర్చ జరుగుతోంది. ఈ సారి పార్టీలు లోక్‌సభ టికెట్‌ను ఆదివాసీలకు ఇస్తాయో లేక లంబాడా తెగ నేతలకు ఇస్తాయోనన్నదానిపైనే జిల్లాకు చెందిన గిరిజన నేతల భవితవ్యం ఆధారపడి ఉంటుందంటున్నారు.


ఓబన్న జయంతి వేడుకల్లో అధికారులు

కలెక్టరేట్‌లో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు


నిర్మల్ కల్చరల్, జనవరి 11 : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో గురువారం ఒడ్డెర కుల ఆరాధ్య దైవం వడ్డే ఓబన్న జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్ ఓబన్న చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓబన్న సేవలను కొనియాడారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో ఓబన్న సైనికుడిగా పని చేశారని గుర్తు చేశారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బీసీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వర్ గౌడ్, జిల్లా అధికారులు, ఒడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, గురువయ్య, గంగాధర్, నర్సయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, రాములు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు పునాది పదో తరగతే : డీఈవో


మాట్లాడుతున్న డీఈవో

నిర్మల్ కల్చరల్, జనవరి 11 : విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది పునాది వేసేది పదో తరగతేనని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పదిలో మంచి ర్యాంకు సాధించాలంటే ప్రణాళికబద్ధంగా కష్టపడి చదవాలన్నారు. సంక్రాంతి సెలవులు సద్వినియోగించుకోవాలన్నారు. పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీహరిరావును కలిసిన డీఆర్డీవో


శ్రీహరిరావుకు మొక్కను అందజేస్తున్న డీఆర్డీవో

నిర్మల్ కల్చరల్, జనవరి 11 : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావును గురువారం డీఆర్డీవో విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు.

రక్తహీనతపై మహిళలకు అవగాహన

నిర్మల్ కల్చరల్, జనవరి 11 : మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్మల్‌లోని రాంనగర్‌లో రక్తహీనతపై మహిళలకు అవగాహన కల్పించారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఎనీమియాసే నిర్మల్ ముక్త్ కార్యక్రమం నిర్వహించి కోఆర్డినేటర్ సవిత రక్తహీనత వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులు పండ్లు, కూరగాయలు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి శ్వేత, సూపర్‌వైజర్ మతిన్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

'ఆధార్ ఎన్రోల్మెంట్ క్యాంపు 13లోగా పూర్తికావాలి'



జన్‌మన్‌పై వివరిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జనవరి 11 : జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా బలహీన గిరిజన సమూహాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావాలన్న లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆధార్ ఎన్రోల్మెంట్ క్యాంపులు 13లోగా పూర్తి కావాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. గురువారం ఎంపీడీవోలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... జిల్లాలోని పెంబి, కడెం, ఖానాపూర్, మామడ, నిర్మల్ రూరల్, సోన్, సారంగాపూర్ మండలాల్లో పంచాయతీ పరిధిలో ఈ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆధార్ కార్డు ప్రతి గిరిజనుడికి అందే ప్రయత్నం ముమ్మరం చేసిందన్నారు. జన్‌మన్ పథకం ద్వారా వారి అభివృద్ధికి కృషి జరుగుతుందన్నారు. వివిధ పథకాల కోసం లబ్ధిదారుల నమోదు సులభం అవుతుందన్నారు. పీవీటీజీ ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డులు, కిసాన్ క్రెడిట్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 15న ప్రధాని జన్ మన్ ప్రారంభిస్తారన్నారు. ఈ అవకాశం ఉపయోగించుకోవాలని కోరారు. సీఈవో సుధీర్, డీటీడబ్ల్యూవో అంబాజీ, డీఆర్వో లోకేష్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీని సందర్శించిన ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, జనవరి 1 : నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గురువారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ, ఏరియా ఆసుపత్రిని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భవిష్యత్‌లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యలు తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. ప్రజా ప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ తదితరులున్నారు.


మెడికల్ కాలేజీ పరిశీలిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

పనుల నిర్వహణ పట్ల ఆదేశాలు ఇవ్వాలి : ఎమ్మార్పీఎస్

బోథ్ నుండి అడెల్లి ఘాట్ రోడ్డు కటింగ్ పనులతో ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడనుందని జాగ్రత్తగా పనులు నిర్వహించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. స్వామి, శ్రీనివాస్, రవి, రాజు మాదిగలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రైవేట్ జూనియర్ కాలేజీ యాజమాన్యాలు


జిల్లా కేంద్రంలో ప్రైవేట్ జూనియర్ కాలేజీ యాజమాన్యాలు గురువారం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా యాజమాన్యం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కళాశాల యాజమాన్యాల సమస్యలు పరిష్కరించి అండగా ఉంటానని మహేశ్వర్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్ రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సాయిలు, గోవర్ధన్, మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా మిగిలిన భవనానికి నిధులు ఇవ్వండి

దిలావర్‌పూర్, జనవరి 11 : మండలంలోని న్యూ లోలం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న విశ్వబ్రాహ్మణ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం సభ్యులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని కోరారు. గురువారం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. నిధులు మంజూరు చేసి సంఘ భవనాన్ని పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తెలిపారు.

ప్రతీ వాహనదారుడు విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

- కార్డన్ సెర్చ్‌లో సీఐ మోహన్
- ఖానాపూర్‌లో సరైన ధ్రువపత్రాలు లేని పలు వాహనాల సీజ్


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న సీఐ మోహన్


పోలీసులు స్వాధీనం చేసుకున్న సరైన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలు

ఖానాపూర్, జనవరి 11 : ప్రతి వాహనదారుడు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఖానాపూర్ సీఐ మోహన్ అన్నారు. గురువారం ఉదయం మండల కేంద్రంలోని కరీం కాలనీలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు సరిగ్గా లేని 52 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను సీజ్ చేసి జరిమానాలు విధించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్లు ధరించాలని, చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. తమ తమ కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎస్సై లింబాద్రి, కడెం ఎస్సై రాజు, పెంబి ఎస్సై రజినీకాంత్, దస్తూరాబాద్ ఎస్సై ప్రభాకర్ రెడ్డి, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం


వాఘా బార్డర్‌లో విద్యార్థులు

వాఘా బార్డర్ సందర్శించిన విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, జనవరి 11 : నిర్మల్ విజయ్ హైస్కూల్ విద్యార్థులు విహారయాత్రలో భాగంగా గురువారం వాఘా బార్డర్ సందర్శించారు. అక్కడ జరిగిన సైనికుల పరేడ్ వీక్షించారు. కరస్పాండెంట్ నాగభూషణం, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, తదితరులు విద్యార్థుల వెంట ఉన్నారు.

విజేతలకు బహుమతులు

ముథోల్, జనవరి 11 : మండల కేంద్రంలోని రబీంద్ర హైస్కూల్‌లో హైదరాబాద్ చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాకరణ ప్రజ్ఞా పోటీ పరీక్షలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా చిమ్మపూడి ఫౌండేషన్ భైంసా డివిజన్ కన్వీనర్ జాదవ్ పుండలిక్‌రావ్ పాటిల్ మాట్లాడుతూ... పోటీలో గెలుపు ఓటములు సహజమన్నారు. ఒకసారి ఓడిపోయినంత మాత్రాన సర్వస్వం కోల్పోయినట్లు భావించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలంగాణ ఉద్యమం ఫోరం అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణగౌడ్ విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. సాయినాథ్, కరస్పాండెంట్ ఏ. రాజేందర్, చిమ్మపూడి ఫౌండేషన్ కోకన్వీనర్ పీసర శ్రీనివాస్‌గౌడ్, తెలుగు ఉపాధ్యాయులు నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడికి నాలుగేళ్ల జైలు

నిర్మల్ కల్చరల్, జనవరి 11 : ఐదేళ్ల పసిపాపకు మాయమాటలు చెప్పి అసభ్యంగా ప్రవర్తించినందుకు గాను రాథోడ్ రాజేష్ అనే యువకుడికి గురువారం నాలుగేళ్ల కఠిన జైలుశిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు ప్రధాన ప్రత్యేక న్యాయాధికారి ఏ.కర్ణకుమార్ తీర్పునిచ్చారు. ఈ విషయాన్ని కోర్టు సమన్వయ అధికారి సక్రియానాయక్ ఒక ప్రకటనలో వివరించారు. సారంగాపూర్ మండలానికి చెందిన నిందితుడు 19 నవంబరు 2017లో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలిపారు.

మండలంలోని ఓ తండాలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్దకు నిందితుడు రాగా.. పాప ఇంటి ముందు ఆడుకుంటుండగా బిస్కెట్లు ఇస్తానని మాయమాటలు చెప్పి నేరస్తుడు తనవెంట సమీపంలోని తోటవైపు తీసుకెళ్లాడని పేర్కొన్నారు. అక్కడ పసిపాపపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. పాప తండ్రి నేరస్తుడిపై అనుమానంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వైజ విశ్వాస్‌రెడ్డి 9 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారించగా నేరం రుజువైందన్నారు.